క్లుప్తంగా

ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల రాకతో క్షేత్రం కిటకిటలాడింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫల,పుష్పాలతో అలంకరించారు. కొందరు భక్తులు మొక్కు చెల్లింపులో భాగంగా ప్రత్యేక అభిషేకాలను చేపట్టారు. మరికొందరు క్షేత్ర ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

జూదరుల అరెస్ట్

మంత్రాలయం రూరల్: మాధవరం గ్రామంలోని నరసప్ప ఆలయం వద్ద అందర్ బందర్ ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌బాబు సోమవారం తెలిపారు. అలాగే.. వారి నుంచి రూ.25 వేల నగదు సీజ్ చేసి, గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

238 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారితో ఆవోపా సభ్యులు

ఆదోని అర్బన్ : ఆవోపా ఆధ్వర్యంలో ఆదోనిలో ఈనెల 3న నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 258 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించగా, కర్నూలు విశ్వభారతి హాస్పిటల్‌లో మొత్తం 238 మందికి ఆపరేషన్లు చేయించామని వారంతా సోమవారం ఆదోనికి వచ్చారని ఆవోపా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనాథ్‌గుప్తా, శ్రీధర్, నగేష్, కాకుబాళ్ తెలిపారు. వారు మాట్లాడుతూ మిగిలిన 20 మందికి బీపీ, షుగర్ అధికంగా ఉండడంతో అబ్జర్వేషన్‌లో ఉంచారన్నారు.

సంక్షేమ పథకాలపై నేడు సమావేశం

కౌతాళం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంక్షేమ పథకాల అమలుపై మంగళవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని సూచించారు. పాఠశాలలో ప్రారంభం కావడంతో ప్రతి గ్రామంలో బడిఈడు పిల్లలు బడి బయట లేకుండా చూడాలని కోరారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

హొళగుంద: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన శ్రీవిజయేంద్ర తీర్థుల 409వ ఆరాధన మహోత్సవాలు మంగళవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. వేడుకలో భాగంగా ఈ నెల 15న పూర్వారాధన, 16న మధ్యారాధన, 17న ఉత్తరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భజన కార్యక్రమంతో పాటు స్వామి వారికి పంచామృత, తులసి అర్చన, నైవేద్యం, ప్రవచన, భజన, స్వస్తివాచన, మహామంగళహారతి, స్వామి వారి రథోత్సవం తదితర కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయని ట్రస్టు సభ్యులు తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ఆలూరు రూరల్: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత వెలికితీసేందుకు గ్రంథాలయాల్లో వేసవి శిబిరాలు నిర్వహించినట్లు ఆలూరు వైస్ ఎంపీపీ శ్రీరాములు అన్నారు. సోమవారం మొలగవల్లి గ్రంథాలయంలో లైబ్రేరియన్ భాస్కర్ ఆధ్వర్యంలో వేసవి శిబిరం ముగింపోత్సవం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే కథలు, నవలలు,గ్రంథాలు చదవడం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

నందవరం: పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థులు జ్ఞానం పెంపొందించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, పంచాయతీ కార్యదర్శి రంగనాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ వై.శివరామప్రసాద్ ఆధ్వర్యంలో వేసవివిజ్ఞాన శిబిరం ముగింపోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసి స్వీట్స్, బహుమతులు పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదోని టౌన్ : చర్మకారుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు ఆంతోనీ, గుంటెప్ప, అనుబంధ సంఘం కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిక్కప్ప ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక పాత బస్టాండు సర్కిల్‌లో చర్మకారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 24వ తేదీన ఎమ్మిగనూరు పట్టణంలో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- ఆహ్లాదకర వాతావరణంలో పాఠశాలలు పునఃప్రారంభం
- తొలి రోజు విద్యార్థులకు విద్యాకానుక కిట్ల పంపిణీ

కౌతాళం: దాదాపు రెండు నెలలుగా మూగబోయిన పాఠశాలలు సోమవారం ఒక్కసారిగి సందడిగా మారాయి. వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు యూనిఫాంతో వచ్చి మారిన తరగతి గదుల్లో ఉత్సాహంగా గడిపారు. గతేడాది నేలపై కూర్చొని చదువుకున్న వారికి ప్రస్తుతం బెంచీలు ఏర్పాటు చేయడంతో నదిచాగి గ్రామంలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. విద్యా కానుక కిట్లను పంపిణీకి వచ్చిన నాయకులు, గ్రామ పెద్దలు గతంలో ఇదే పాఠశాలలో నేల మీద కూర్చొని చదువుకున్నామని, ఇప్పుడు జగనన్న ప్రభుత్వం ఏర్పాటు చేసిన బెంచీలను గమనించి వాటిపై కాసేపు కూర్చొని పాఠాలు విన్నారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ ఈశప్పగౌడు, ఎంపీటీసీ లింగన్నగౌడ్, రామన్నగౌడు, పెద్దలు రామయ్యశెట్టి, లక్ష్మినారాయణశెట్టి, ఆదెప్ప ఉన్నారు. నాడు-నేడు, విద్యా కానుక, విద్యా దీవెన, అమ్మఒడి వంటి పథకాలు పేద విద్యార్థుల చదువులకు దోహదం చేస్తున్నాయని కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు వీరసేన రెడ్డి అన్నారు. కామవరం జడ్పీ పాఠశాలలో విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. బాపురంలో గ్రామ నాయకుడు గురునాథ్‌రెడ్డి, గుడికంబాలిలో సర్పంచ్ సిద్దేశ్, నదిచాగిలో గ్రామ నాయకులు కిట్లను పంపిణీ చేశారు. కాగా మండలంలో 32 పాఠశాలల్లో నాడు-నేడు పనులు పూర్తయ్యాయి. మరో 21 బడుల్లో పనులు కొనసాగుతున్నాయి.

పెద్దకడబూరు : మండలంలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ అట్టహాసంగా ప్రారంభమైంది. స్థానిక ఉన్నత పాఠశాల, మెయిన్ పాఠశాల, కస్తూర్బా, గురుకుల పాఠశాలతో పాటు మండలంలోని దొడ్డిమేకల, కల్లుకుంట, కంబలదిన్నె తదితర గ్రామాల్లో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లును విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రామ్మూర్తి ఆధ్వర్యంలో ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు కిట్లు అందజేశారు.



నదిచాగిలో తరగతి గదిలో కూర్చొని బోధనను వింటున్న నాయకులు, గ్రామ ప్రముఖులు

కోసిగి: చదువుతోనే పిల్లల జీవితాలు బంగారుమయమవుతాయని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు పి. మురళీ మోహన్ రెడి పేర్కొన్నారు. సోమవారం స్థానిక బాలురు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో విద్యాకానుక కిట్లును విద్యార్థులకు అందించారు. ఎంపీపీ ఈరన్న, పీఎంసీ చైర్మెన్ పి. ఈరన్న, వైస్ చైర్మెన్ వేమా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మంగమ్మ పాల్గొన్నారు.







కామవరం జెడ్పీ పాఠశాలలో విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం, పెద్దకడబూరులో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీవిద్య, బాపురంలో కిట్ల పంపిణీ చేస్తున్న దృశ్యం

నేడు ఉరుకుంద హుండీ సొమ్ము లెక్కింపు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కిస్తామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ స్థానిక డార్మెంటరి హాల్‌లో లెక్కింపు ఉంటుందని చెప్పారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఆదోని టౌన్ : పట్టణ పరిశుభ్రతే లక్ష్యంగా సాగుతున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని కోర్టు, సబ్‌ట్రెజరీ కార్యాలయం, రైతు బజార్ ఏరియా, కోర్టు ఏరియా పరిధిలో శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఈ ప్రాంతంలోనే ఉండడం వల్ల ఏరోజుకారోజు చెత్త లేకుండా తొలగించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు.

రచ్చుమర్రిలో కొనసాగుతున్న బందోబస్తు

మంత్రాలయం రూరల్: మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో బందోబస్తును కొనసాగిస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కిరణ్‌బాబు సోమవారం తెలిపారు. గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో ప్రత్యేక బలగాలతో పహారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

కోసిగి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ లెక్చరర్ అసోసియేషన్ నాయకులు మద్దిలేటి, ఉదయ్ కిరణ్ రెడ్డి, సాంబశివుడు, రామకృష్ణ కోరారు. సోమవారం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని కోసిగి, మంత్రాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 14 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. ఇటీవల కేబినేట్ నిర్ణయంలో సర్వీసు నిబంధనలు పెట్టడంతో దాదాపు 2వేల మందికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అందరినీ రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన సానుకూలంగా స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.



ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అధ్యాపకులు

నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల వసూలు

ఆదోని సెంట్రల్: పట్టణంలోనున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, ఖాజా తెలిపారు. సోమవారం డీఈఓ రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి ఫీజుల పెంపును నిర్ణయించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఇష్టానుసారంగా పెంచారని, ఫీజుల బోర్డులను ఏ పాఠశాలలోనూ ఏర్పాటు చేయడం లేదన్నారు. వసతులు సరిగా లేకపోయినా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. సంఘం డివిజన్ అధ్యక్షుడు మోహన్, అజామూ,వీరేంద్ర, రాజు పాల్గొన్నారు.



డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఆర్‌ఏవీఎఫ్ నాయకులు

కర్ణాటక మద్యం స్వాధీనం

హాలహర్వి: అర్దగేరి గ్రామ శివారులోని హత్తిబెళగల్ క్రాస్ రోడ్డులో సోమవారం ఆలూరు మండలం హత్తిబెళగల్‌కు చెందిన ఖాదర్‌బాషా అనే వ్యక్తి కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి ఆరు బాక్సుల్లోని 528 మద్యం టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్ పరిమాణం గలవి) స్వాధీనం చేసుకుని బైకును సీజ్ చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలించినా, విక్రయించినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

వెల్దుర్తి: కోడుమూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ బృందం, స్థానిక పోలీసులు సోమవారం వెల్దుర్తి మండలంలో నిర్వహించిన సోదాలలో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల మేరకు.. గోవర్ధనగిరిలో జరిపిన సోదాల్లో మద్దమ్మ వద్ద నుంచి, ఎల్ నగరంలో జరిపిన సోదాల్లో అయ్యస్వామి వద్ద నుంచి 46 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను డోన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

ఆలూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన విత్తనాలనే వాడాలని ఆలూరు ఏడీఏ సునీత సూచించారు. సోమవారం స్థానిక ఆర్బీకే-2లో రైతులకు వేరుశనగ లేపాక్షి బ్రాండ్ ఫ్రీ కిట్ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సబ్ డివిజన్‌లోని 5 మండలాలకు ఉన్నతాధికారులు 30 కిట్లను సరఫరా చేశారన్నారు. మండలానికి 6 కిట్లు చొప్పున కేటాయించగా ఉత్తమ రైతులను ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నామన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు రైతులు తమ పొలంలో 10 శాతం భాగంలో వేరుశనగ లేపాక్షి బ్రాండ్ విత్తనాలతో పంట సాగు చేసి ఎంతమేర దిగుబడి వచ్చిందో తెలియజేస్తారని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు ఆయా ఆర్బీకేల పరిధిలో విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఆర్బీకే పరిధిలో 10 మంది రైతుల పొలాలను ఎంచుకుని మట్టి నమూన పరీక్షలు చేస్తున్నామన్నారు. ఈ నెల 20 లోపు నమూనాల సేకరణ పూర్తిచేస్తామని తెలిపారు. ఆలూరు వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ గౌడ్, రైతులు, ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.



హులేబీడులో వేరుశనగ విత్తనాలు అందిస్తున్న దృశ్యం

నేడు జాబ్‌మేళా

మద్దికెర: పత్తికొండలోని డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏపీఎం మధుబాబు సోమవారం తెలిపారు. రెండు ఫొటోలు, ఆధార్ కార్డు, ధ్రువపత్రాలు తెచ్చుకోవాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: పత్తి పంట సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా జల వనరుల ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏడీఏ ప్రవీణ్ సూచించారు. వారు సోమవారం సోగనూరు ఆర్బీకేలో పత్తి పంట సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు వ్యవసాయ శాఖ అనుమతి కలిగిన విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనశుద్ధి తప్పని సరిగా చేయాలన్నారు. ఏఓ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పొలం రస్తా విషయంలో ఘర్షణ

మంత్రాలయం రూరల్: మండలంలోని సూగూరు గ్రామంలో పొలం రస్తా విషయంలో గ్రామానికి చెందిన రెండు వర్గాల మధ్య సోమవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఓ వర్గానికి చెందిన వారి పొలంలో అదే గ్రామానికి చెందిన మరో వర్గం వారు ట్రాక్టర్‌పై వెళ్తుండటాన్ని చూసి.. పోసిన నారు మొలకలు చనిపోతాయని గొడవపడ్డారు. మాటమాట పెరిగి రెండు వర్గాల వారు కొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం స్టేషన్‌లో విచారిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోసిగి: మండలంలోని డి.బెళగల్ రోడ్డులో బాట మారెమ్మ దేవాలయం సమీపంలో మండల కేంద్రానికి చెందిన పెండేకంటి మూర్తి అనే వ్యక్తికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం బైక్‌పై వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్తుండగా పొలం వైపు తిరిగే సమయంలో వెనుక నుంచి చిన్న భూంపల్లికి చెందిన మరో బైక్ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మూర్తికి తీవ్ర రక్త గాయాలైయ్యాయి. స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అక్రమాలను అరికట్టాలి

పత్తికొండ రూరల్: ఎరువుల దుకాణాల్లో అక్రమాలను అరికట్టాలని కోరుతూ బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు సోమవారం స్పందన కార్యక్రమంలో ఆర్డీఓ మోహన్‌దాస్‌కు వినతి పత్రం అందజేశారు. కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సిసి.రంగన్న, మండలాధ్యక్షుడు శంకరయ్యాచారి మాట్లాడుతూ.. ఎరువుల దుకాణాల్లో ధరల పట్టిక ప్రదర్శించకుండా రైతుల నుంచి అధిక మొత్తం వసూలు చేస్తూన్నారని ఆరోపించారు.

ఆదోనిలో మంత్రి బుగ్గన విస్తృత పర్యటన





సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి, విద్యార్థినికి జగనన్న విద్యాకానుక కిట్ అందజేస్తున్న దృశ్యం

- పలు కార్యాలయాల ప్రారంభం
- విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ

ఆదోని రూరల్ : రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం ఆదోనిలో విస్తృతంగా పర్యటించారు. పలు నూతన కార్యాలయాలను ప్రారంభించారు. ముందుగా ఆయన మధ్యాహ్నం 12 గంటలకు మండలంలోని విరుపాపురం వద్ద రూ.7.56 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ భవనాన్ని ప్రారంభించారు. కళాశాల భవనాలను పరిశీలించారు. మరిన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అలాగే..పట్టణంలో నూతన డివిజన్ ఉప ఖజానా కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఆర్థిక శాఖ నిధుల ద్వారా మొదటి, రెండో ఫేజ్‌లలో రూ.1.08 కోట్లు వెచ్చించి నిర్మించారు.

విద్యార్థులకు వరం జగనన్న విద్యాకానుక..

జగనన్న విద్యాకానుక విద్యార్థులు, తల్లిదండ్రులకు వరమని మంత్రి బుగ్గన పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ స్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. 133 స్కూళ్లలో 31,952 మంది విద్యార్థులకు కిట్లను నాలుగో విడతలో అందజేసినట్లు చెప్పారు. నోట్ పుస్తకాలు, బూట్లు, మూడు జతల స్కూల్ యూనిఫాంలు, బ్యాగ్, బెల్ట్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పిక్టోరియల్ డిక్షనరీ, రెండు జతల సాక్స్, పాఠ్య పుస్తకాలు సహా మొత్తం 9 వస్తువులను కిట్లలో ఉంచి అందజేసినట్లు చెప్పారు. జిల్లా మొత్తం 25 మండలాల్లోని 1,493 పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న మొత్తం 2,93,955 మంది విద్యార్థులకు కిట్లను అందిస్తున్నామన్నారు. అనంతరం పిల్లలతో ముచ్చటించారు. బల్బ్‌ని కనిపెట్టి ప్రపంచానికి వెలుగులు పంచిన శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిషన్ చిన్ననాటి కథను విద్యార్థులకు తెలియజేసి వారిలో స్ఫూర్తి నింపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదన్, జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ సృజన, సబ్‌కలెక్టరు అభిషేక్‌కుమార్, డీఈఓ రంగారెడ్డి, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి వేణుగోపాల్, పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, చైర్మన్ శాంతి, ఎంపీపీ దానమ్మ, తహసీల్దార్ వెంకటలక్ష్మీ, ఎంఈఓ శివరాములు పాల్గొన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ..

ఆదోని రూరల్ : ఆదోనిలో కోర్టు భవనాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని ఆదోని బార్ అసోసియేషన్ నాయకులు సోమవారం కోరారు. ఇప్పటికే అద్దె భవనాల్లో కొనసాగడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మంత్రి స్పందిస్తూ త్వరలోనే నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనితాబాయి, కార్యదర్శి డాక్టర్ అంజినప్ప, వైస్ ప్రెసిడెంట్ సావిత్రిరాణి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాండవగల్లు చెరువును స్వాధీనం చేసుకోవాలి



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి విన్నవిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

మండలంలోని పాండవగల్లు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పెద్ద చెరువును స్వాధీనం చేసుకోవాలని పెద్దచెరువు సాధన కమిటీ నాయకులు, గ్రామస్తులు సోమవారం ఆర్థికశాఖ మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 24.82 ఎకరాల్లో పెద్దచెరువు ఉందని, దీనిని కొందరు అక్రమార్కులు స్వాధీనం చేసుకున్నారన్నారు. 2006లో ప్రభుత్వంపై వేసిన ఆదోని డివిజన్ కోర్టులో కేసు (ఓఎస్ 127/2006) వేయగా 2012లో ప్రభుత్వ చెరువుగా కోర్టు తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. మరోసారి ఆక్రమణదారులు జిల్లా కోర్టులో అప్పీల్ సూట్ (నం.28/2012) వేశారన్నారు. హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని చెప్పారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

నిధులు కేటాయించాలి..

నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, నాయకులు తిప్పన్న, వీరేష్, వెంకటేష్,శ్రీను, శేఖర్ మంత్రి బుగ్గనను కలిసి వినతి పత్రం అందజేశారు.

పోషకాలతో 'జగనన్న గోరుముద్ద'

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం కింద పోషకాలతో కూడిన ఆహారం అందిస్తున్నట్లు ఎండీఎం ఏడీ శ్యాముల్ పాల్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంతో పాటు రాగిజావ తయారీని పరిశీలించారు. విద్యార్థినులకు రాగిజావ అందజేసి వారితో పాటు రుచి చూశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాశాఖ నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచి, శుచితో కూడిన మధ్యాహ్న భోజనం వడ్డించాలని వంట ఏజెన్సీ వారికి సూచించారు. ఎంఈఓ ఆంజినేయులు, హెచ్‌ఎం కృష్ణమూర్తి వెంట ఉన్నారు.



విద్యార్థినులకు రాగిజావ అందిస్తున్న ఏడీ శామ్యూల్ పాల్

నిర్ణీత గడువులోగా వినతులకు పరిష్కారం

కర్నూలు(సెంట్రల్) : స్పందనలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న అర్జీలకు నిర్ణీత గడువులోగా నాణ్యత ప్రమాణాలు పాటించి పరిష్కారాలు చూపాలని జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్పందనలో వచ్చిన అర్జీలను అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాంలో వచ్చే సమస్యలకు సరైన ఎండార్స్‌మెంట్ ఇచ్చినప్పుడే రీ ఓపెన్ శాతాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు.

స్పందనలో వచ్చిన కొన్ని వినతులు...

- తన భర్త లేట్ వెంకటేశ్ నాయక్‌కు హుసేనాపురం పోలిమేరలోని సర్వే నంబర్ 70/2లో 1.50 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చిందని, ప్రస్తుతం ఆయన మరణించడంతో ఆ భూమిని తన పేరిట ఆన్‌లైన్ చేయాలని ఓర్వకల్లు మండలం కాల్వకు చెందిన సుగాలి సాలమ్మ జేసీకి వినతిపత్రం ఇచ్చారు.
- తన తల్లికి నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో గృహం మంజూరైనదని, అయితే ఆమె ఇటీవల మరణించడంతో ఆ ఇంటిని తన పేరిట మంజూరు చేయాలని ఆలూరు మండలం నివాసి రాము అధికారులకు విన్నవించారు.
- సర్వే నంబర్ 182/ఏలో 4.80 ఎకరాల పొలం ఉండగా అందులో 2.40 ఎకరాలు పొలం తమదంటూ కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని కౌతాళం మండలం బదినేహాల్‌కు చెందిన పి.రంగస్వామి అధికారుల ఎదుట వాపోయారు
- కర్నూలు జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జి.రామకృష్ణ జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతిపత్రం అందించారు.
- కల్లూరు వక్కెరవాగు పాత బ్రిడ్జి స్థానంలో ఎత్తు పెంచి కొత్త బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ సీపీఎం నాయకులు కె.సుధాకరప్ప ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు.



ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తున్న జేసీ ఎన్.మౌర్య, ఇతర అధికారులు

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: ఎరుకలచెర్వు గ్రామంలోని ఎస్సీ హాస్టల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హాస్టల్‌లో విద్యార్థులకు ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్ కోసం ట్యూటర్లతో శిక్షణ, ప్రతి నెలా కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడంతో పాటు ఉచితంగా దుప్పట్లు, ట్రంకు పెట్టెలు, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆలయ భూమి కౌలుకు వేలం

తుగ్గలి: ఎద్దులదొడ్డి వీరభద్రేశ్వర స్వామి ఆలయ భూముల కౌలుకు సోమవారం ఎండోమెంట్ అధికారి గుర్రెడ్డి వేలం నిర్వహించారు. స్వామి ఇనాం భూమి 29.32 ఎకరాలను ఏడాది పాటు కౌలుకు సాగు చేసుకునే హక్కులను వేలం పాటలో గ్రామానికి చెందిన రంగస్వామి రూ.76 వేలకు దక్కించుకున్నారు.

ట్రాక్టర్ బోల్తా

వెల్దుర్తి: కలుగొట్ల గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద డౌన్ రోడ్‌లో చెరువు మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ సోమవారం అదుపుతప్పి బోల్తా పడింది. నర్సాపురానికి చెందిన ట్రాక్టర్ బ్రహ్మగుండం వద్ద ఎర్ర చెరువులోని పూడిక మట్టి లోడుతో ఉయ్యాలవాడ వైపు వెళ్తుండగా డౌన్ రోడ్‌లో అతివేగంగా దూసుకెళ్లడంతో బోయనపల్లెకు చెందిన యువ డ్రైవర్ అదుపు చేయలేకపోయాడు. దీంతో ట్రాక్టర్ పల్టీ కొట్టింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు.

ఇద్దరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని చెన్నాపురం గ్రామ మలుపు వద్ద సోమవారం ఎమ్మిగనూరుకు వస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఆర్ మురహర రెడ్డి వాహనాన్ని ఆదోని వైపు వెళ్తున్న స్కూటర్ ఢీకొనడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్కూటర్ కారును ఢీకొట్టడంతో కారు టైరు పేలిపోయింది. కారులో ఉన్న మురహర రెడ్డికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. గాయపడిన ఇద్దరు యువకులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.